
ప్రజాశక్తి

గురువారం 15 ఆగస్టు 2024 | 5 | విజయనగరం





150 అడుగుల జెండాతో ప్రదర్శన

బొబ్బిలి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయ జెండాతో బుధవారం బొబ్బిలి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. తాండ్ర పాపారాయ విగ్రహం వద్ద ఈ ప్రదర్శనను ఆర్‌డిఒ సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ప్రారంభించారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



శృంగవరపుకోటలో మానవహారం చేపడుతున్న సహారా బాధితులు, పోరాట కమిటీ నాయకులు

డిపాజిట్ల డబ్బులు తిరిగివ్వకుంటే...

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

- కేంద్రాన్ని హెచ్చరించిన సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ గౌరవ సలహాదారు తమ్మినేని సూర్యనారాయణ
- శృంగవరపుకోట, బొబ్బిలి, రాజాంలో భారీర్యాలీలు, మానవహారాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

50 కోట్ల మంది దేశ ప్రజలతో ముడిపడి ఉన్న సహారా ఇండియా డబ్బులు ఖాతాదారులకు చెల్లించకుంటే ప్రధాని మోడీ, కేంద్రమంత్రి అమిత్‌షా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ (సిఐటియు అనుబంధం) గౌరవ సలహాదారు తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవారం సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో శృంగవరపుకోట పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దేవి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ 13 ఏళ్లుగా ఖాతాదారులకు డబ్బులు చెల్లించకుండా సహారా యాజమాన్యం రెన్యువల్ పేరుతో కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది ఖాతాదారులు తమ పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇతర అవసరాల కోసం డబ్బులు దాచుకుంటే, ఏళ్ల తరబడి చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రజలను, సహారా ఖాతాదారులను పక్కదారి పట్టించేందుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో తప్పుడు ప్రకటన చేశారని ధ్వజమెత్తారు. డిపాజిట్ సొమ్ము చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఖాతాదారులు ముందుకు రావడం లేదని అనడం సరికాదన్నారు. డబ్బులు ఇస్తామంటే ఖాతాదారులు ఎందుకు ముందుకు రారని నిలదీశారు. సహారా బాధితుల పోరాటం కొన్ని నెలలుగా సాగుతోందని, ప్రభుత్వం స్పందించి డబ్బులు చెల్లించకపోతే ఈ ఉద్యమాన్ని దేశ వ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. పేదలకు న్యాయం జరిగే వరకు సిఐటియు ఖాతాదారులకు అండగా ఉంటూ పోరాడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఖాన్, ప్రకాశ్, సిమ్మ అప్పారావు, నాగేశ్వరరావు, ఎం.రమణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. అనంతరం చర్చి సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహారా బాధితుల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ బి.లక్ష్మీదాస్, నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం మాట్లాడుతూ ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ వ్యాఖ్యలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఖాతాదారులకు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహారా బాధితుల పోరాట కమిటీ సభ్యులు కెఎల్ నాయుడు, ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రాజాం : రాజాంలో సహారా కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. ఖాతాదారులకు వెంటనే డిపాజిట్ల డబ్బులు చెల్లించాలంటూ నినాదాలు చేశారు.



మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ





బొబ్బిలి, రాజాంలో మానవహారం నిర్వహిస్తున్న సహారా బాధితులు, పోరాట కమిటీ నాయకులు

అందరితోపాటే ఉమ్మడి విజయనగరం జిల్లాకూ స్వాతంత్ర్యం వచ్చింది. మన జిల్లా నుంచీ అనేక మంది ఉద్దండులు స్వాతంత్ర్యోద్యమంలో పోరాడి జైళ్లకు వెళ్లారు. ఉద్యమంలో ప్రాణాలర్పించారు. కానీ, మిగిలిన జిల్లాలతో పోల్చినప్పుడు అభివృద్ధిలో మన ప్రాంతం అథమ స్థానంలోనే ఉండిపోయింది. అక్షరాస్యతలోనూ అట్టడుగు. సర్కారు దవాఖానాలకు వెళ్లాలంటే నేటికీ డోలీ మోతే. అదుపులేని నిరుద్యోగం. ఎటూ సరిపోని తలసరి ఆదాయం. ఒకప్పుడు రాజుల్లా బతికే రైతులు నేడు పొట్టచేతపట్టుకుని పట్టణాలకు వలసపోయారు. రైతులు చిన్నాభిన్నమయ్యారు. ఈ క్రమంలో అంతులేని అసమానతలు పెరిగాయి. దళారీ వ్యవస్థ నాటి బ్రిటిష్ పాలనలో మాదిరిగానే కొనసాగుతోంది. వీటన్నింటికీ కారణం ఓ సినీ కవి చెప్పినట్టు పాలకుల నిర్లక్ష్యం, పదవీ వ్యామోహాలు, కుల మత భేదాలు ఒక కారణమైతే, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మరోకారణంగా చెప్పకోవచ్చు. ఇటువంటి దుర్భిక్ష పరిస్థితుల నడుమ మన జిల్లా అధికార యంత్రాంగం గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తోంది.



అంతులేని అసమానతలు

- అక్షరాస్యతలో అట్టడుగు స్థానం
- నేటికీ తప్పని డోలీ మోత
- అదుపులేని నిరుద్యోగం
- వలస కూలీలుగా మారిన వ్యవసాయ కుటుంబాలు
- దుర్భిక్ష పరిస్థితుల నడుమ నేడు స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాకు పోరాటాలు కొత్తేమీ కాదు. బ్రిటిష్ వారి నియంతృత్వాలపై 1910లోనే మన జిల్లాకు చెందిన మహాకవి గురజాడ అప్పారావు కలం కత్తి ఝుళిపించారు. దొరల పాలనకు వ్యతిరేకంగా 1921లో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చింతకండి సత్యనారాయణ తన రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పాల్గొన్నారు. పసుమర్తి వీరభద్రస్వామి, కలిమిశెట్టి రామమూర్తి, ఉల్లి తిరుపతి, ధర్మవరానికి చెందిన అల్లు జోగినాయుడు తదితరులు ఉద్యమంలో భాగస్వామ్యమై జైలు జీవితం అనుభవించారు. విజయనగరానికి చెందిన ద్వారకాభమిటి రామదీక్షితులు, జొన్నవలసకు చెందిన పూసపాటి బుచ్చి సీతారామచంద్రరావు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. విదేశీ వస్తువుల బహిష్కరణపై సాలూరు, చీపురుపల్లి, బొబ్బిలి ప్రాంతాల్లో పెద్దఎత్తున ప్రచార సభలు నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా భావిస్తున్న మహాత్మాగాంధీ విజయనగరంలో ముచ్చటగా మూడు సార్లు పర్యటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మన జిల్లా నుంచి ఎంతోమంది ఉద్యమంలో పాల్గొని సమసమాజం కోసం ప్రాణత్యాగాలు చేశారు. కానీ, వారి త్యాగాలకు తగిన ఫలితాలు మన జిల్లాకు దక్కలేదన్నది సర్కారీ లెక్కలే తార్కాణం. ఉపాధి, ఉద్యోగ మార్గాలు చూపే పారిశ్రామిక రంగంలో జిల్లా ఇప్పటికీ చివరి స్థానంలోనే ఉంది. చిన్నాచితక తప్ప భారీ పరిశ్రమలు మన జిల్లాలో లేవు. ఒకప్పుడు జ్యూట్‌మిల్లులకు పుట్టినిల్లుగా ఉండేది మన ప్రాంతం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ఉదాసీనత వెరసి దాదాపు మిల్లులన్నీ మూతపడ్డాయి. ప్రస్తుతం వాటి ఉనికే లేకుండా పోయింది. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కూడా సుమారు పది వరకు కనుమరుగయ్యాయి. బొబ్బిలి, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు లేక లేఅవుట్లు వెలవెలబోతున్నాయి. ఇలా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు కాక, ఉన్న పరిశ్రమలు మూతపడి ఉన్న ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు పోయాయి. దీంతో, పారిశ్రామిక వృద్ధిరేటు క్షీణిస్తోంది.

జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 70శాతం ప్రజానీకం జీవనాధారంగా ఉన్న వ్యవసాయరంగం నానాటికీ దిగజారుతోంది. పుష్కలమైన సాగునీటి వనరులున్నా వాటిని సద్వినియోగం చేసే పాలకులే కొరవడ్డారు. దీంతో స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల కావస్తున్నా కరువు కాటకాలకు, ప్రకృతి వైపరీత్యాల ఆగ్రహానికి రైతులు, వారిపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులు గురికావాల్సి వస్తోంది. వ్యవసాయరంగం వృద్ధిరేటు కేవలం రూ.13,343 కోట్లే. సేవా రంగం విస్తరణకు పుష్కలమైన అవకాశాలున్నా ఆశించిన పురోగతి లేదు. గుండె, ఊపిరితిత్తులు తదితర రోగాలకు మన జిల్లాలో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జనాభాకు తగినన్ని ఆసుపత్రులు, పాఠశాలలు లేవు. దీంతో, ఏజెన్సీలో ఇంకా డోలిమోతలు, పసరమందులు తప్పడం లేదు. చాలా గ్రామాలకు తాగునీటి సదుపాయం లేదు. అభివృద్ధికి ఆయువుపట్టులాంటి విద్యలో మన జిల్లా అట్టడుగు స్థానంలో ఉంది. తగినన్ని స్కూళ్లు, కాలేజీలు లేవు. ఉన్న బడులను సైతం మూసివేయడంతో విద్యకు దూరమౌతున్నారు. జిల్లా అక్షరాస్యతా శాతం 58.89శాతం మాత్రమే. అక్షరాస్యత లేమిని ఆసరా చేసుకుని జిల్లాలో నిధులు, వ్యవసాయ ఉత్పత్తులు సర్కారు దోపిడీ చేయడంతో ప్రజల తలసరి ఆదాయం రూ.1,30,203కు పరిమితమైంది. ఇది ఏమాత్రమూ సరిపోకపోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నవారు, తల్లిదండ్రులను పోషించుకోలేక, పిల్లల్ని చదవించుకోలేక పొట్టచేతపట్టుకుని ఊరూ, వాడ వదిలి వలసపోతున్న కుటుంబాలు కోకొల్లలు.

డిగ్రీ, పీజీ పట్టాలు పట్టుకుని ఉద్యోగాల కోసం విదేశాలకు పోతున్నవారూ తక్కువేం కాదు. వీరికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాల్సిన పాలకులు పట్టణ కేంద్రాల్లో ఏపూటకాపూట పట్టెడు అన్నం పెట్టి, అదే గొప్ప ఘనకార్యంగా చెప్పకుంటున్నారు. బహుశా ఇటువంటి వారికోసమే విజయనగరం జిల్లా కేంద్రంలో గడిచిన ఐదేళ్ల ఫుడ్ బ్యాంకులు (మిగిలిపోయిన ఆహారాన్ని పంచేందుకు ఏర్పాటుచేసినవి) నడిపారు. తాజాగా అన్న క్యాంటీన్లు పున:ప్రారంభానికి సిద్ధమయ్యారు. ఇదేమీ గొప్ప విషయం కాదు. కటిక పేదరికం ఉందనడానికి ఇదో మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. మత్స్యకారులు, గిరిజనులు నేటికీ సమాజాభివృద్ధికి దూరంగానే మిగిలిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో 'స్వాతంత్ర్యం వచ్చెననీ... సభలె చేసీ సంబర పడగానే సరిపోదోయి' అంటూ స్వాతంత్ర్య అనంతర పరిణామాలను చాటి చెప్పిన మహా కవి శ్రీశ్రీ విశ్లేషణలు ప్రతిఒక్కరూ, ముఖ్యంగా పాలకులు అన్వయించుకోవాల్సిన అవసరం ఉంది. 'సాధించిన దానికి సంతృప్తిని పొందీ అదె విజయమనుకుంటే పొరపాటోయి' అన్న మాటలను ప్రజలు బోధపర్చుకోవాలి. వీరుల త్యాగఫలాన్ని గుర్తుచేసుకుని దోపిడీదారులపై పిడికిలి బిగించి సమానత్వం కోసం పాటుపడాలి.

పోలీసు శాఖ తీరు మారాల్సిందే

డిఐజి గోపినాథ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార తీరులో మార్పులు చేసుకోవాలని, ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారి పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టీ ఆదేశించారు. డిఐజిగా బాధ్యతలు చేపట్టిన ఆయన విజయనగరం జిల్లాకు బుధవారం వచ్చారు. ఎస్‌పి వకుల్ జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్, ఇతర పోలీసు అధికారులు డిఐజికి పుష్పగుచ్ఛాలను అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పోలీసుశాఖ ప్రతిష్టను పెంచేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహరించాల్సిన తీరు, నిర్వహించాల్సిన విధులు పట్ల దిశా నిర్దేశం చేశారు. పోలీసు వ్యవస్థలో మార్పులు వచ్చినప్పటికీ నేరాల నియంత్రణలో గతంలో అవలంభించిన బేసిక్ పోలీసింగును మరిచిపోవద్దని సూచించారు. గ్రామ సందర్శనలు, పెట్రోలింగు, రాత్రి, పగలు బీట్లు చేయాలని, గ్రామాల్లో చెడు నడత కలిగిన వ్యక్తులు, ప్రధానమైన శాంతిభద్రతల సమస్యలు గురించి విచారణ చేయాలన్నారు. గతంలో నమోదైన నేరాల కంటే ప్రస్తుతం కొత్త తరహాలో నేరాలు నమోదవుతున్నాయని, వీటిని సవాళ్లుగా తీసుకొని, పోలీసుల పనితీరు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కొత్త తరహాలో నమోదవుతున్న డ్రగ్స్, సైబరు నేరాలను దర్యాప్తు చేసేందుకు అవసరమైన మెళకువలను పోలీసు అధికారులు అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరు, శాంతిభద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను డిఐజికి వివరించారు. సమావేశంలో ఎఎస్‌పిలు అస్మా ఫర్హీన్, ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, ఎ.ఎస్.చక్రవర్తి, ఎం.వీరకుమార్, యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి గోపినాథ్

నేర సమీక్ష

జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు లాఠీలను వెంట తీసుకెళ్లాలని సూచించారు. హత్యాయత్నం కేసుల్లో నిందితుల నేర చరిత్రను పరిశీలించి, రౌడీషీట్లు తెరవాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన వారిపై సస్పెక్ట్ షీట్ తెరచి, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎఎస్‌పిలు అస్మా ఫర్హీన్, ఎం.ఎం.సోల్మన్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన కె.కార్తీక్ నెల్లూరు జెసిగా బదిలీపై వెళ్లారు. సేతుమాధవన్ పార్వతీపురం ఐటిడిఎ పిఒగా పనిచేస్తూ, జిల్లాకు బదిలీపై వచ్చారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కందికుప్పం గ్రామానికి చెందిన సేతుమాధవన్ సివిల్ ఇంజినీరింగ్ చదివి, 2021లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. శిక్షణానంతరం ప్రకాశం జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. ఆ తరువాత మార్కాపురం సబ్ కలెక్టర్‌గా, ఎంఎస్‌ఎంఇ శాఖలో సిఇఒగా పనిచేశారు. అక్కడినుంచి నెల్లూరు జెసిగా పనిచేసి, కొద్దిరోజుల క్రితమే పార్వతీపురం ఐటిడిఎ పిఒగా బదిలీపై వచ్చారు. ఆయన భార్య శోభిక ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన మాధవన్‌కు డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛాలను అందించారు. సేతు మాధవన్ జెసిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, వివిధ అంశాలపై చర్చించారు.



జెసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవన్

నైతిక విలువలతో విద్యనందించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నైతిక విలువలతో విద్యార్థులకు విద్యనందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు.. ఉపాధ్యాయులకు సూచించారు. పూల్‌బాగ్ సమీపంలోని మోడల్ స్కూల్‌ని ఎస్‌ఎంసి చైర్మన్ జయరాజ్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. తరగతి, వంట గదులను పరిశీలించి, విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కొంతమంది క్రమశిక్షణా రాహిత్యంగా తరగతి గదులను, విద్యుత్తు పరికరాలను, ఫర్నిచర్‌ను, శానిటేషన్ సామగ్రిని చిందరవందర చేయడాన్ని తమ దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారని తెలిపారు. కొంత మంది విద్యార్థులు అక్కడ మధ్యాహ్న భోజనం చేయడం లేదని తెలిపారు. సిబ్బంది కొరత కూడా గుర్తించామన్నారు. నిరంతరం విద్యార్థులను పర్యవేక్షించాలని, తరచుగా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


హర్ ఘర్ తిరంగా

దేశభక్తిని చాటేలా..

- ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి
- ప్రతి మండల కేంద్రంలో, ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లు
- జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటిపైన మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని కోరారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలపై సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి, జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. వాటి ఫొటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్‌కి సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ పోటీల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మైనర్ పంచాయతీకి రూ.10 వేలు చొప్పున, మేజర్ పంచాయతీకి రూ.25 వేలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలతో కూడా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. మండల ప్రధాన కేంద్రాల్లో, అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతిఒక్కరూ సెల్ఫీ దిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులను, మాజీ సైనికులను ఉదయం పోలీస్ బారెక్స్‌లో మంత్రి ఘనంగా సన్మానిస్తారని తెలిపారు. సాయంత్రం జరిగే ఎట్ హోం కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రముఖులను ఆహ్వానించి దేశ భక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

పటిష్ట ఏర్పాట్లు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన బుధవారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణపై, అతిథులు, అధికారులు, పాత్రికేయులు, సందర్శకుల కోసం చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.డి. అనిత, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, ఎస్‌డిసిలు మురళీకృష్ణ, జోసెఫ్, తహశీల్దార్ కూర్మనాథరావు పాల్గొన్నారు.

సంతకాల ఉద్యమం ప్రారంభం

హర్ ఘర్ తిరంగా సంతకాల ఉద్యమం జిల్లాలో ప్రారంభమైంది. జిల్లా స్థాయిలోనే కాకుండా, మండల, గ్రామ, స్థాయిలో కూడా పెద్ద ఎత్తున సంతకాలను సేకరించేందుకు ప్రణాళికను రూపొందించారు. దీనికోసం ప్రత్యేక డిజైన్లతో ఫ్లెక్సీ బోర్డులను రూపొందించారు. ఈ బోర్డులపై జైహింద్ అని లేదా, హర్ ఘర్ తిరంగా అని రాసి సంతకాలు చేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, జోసెఫ్, ప్రమీలా గాంధీ, ఆర్‌డిఒలు ఎం.వి.సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి డి.రమేష్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరావు తదితరులు జైహింద్ అని రాసి, సంతకాలు చేశారు.

ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, డిపిఒ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, విజయనగరం మున్సిపల్ సహాయ కమిషనర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రిహార్సల్స్ పరిశీలన

పోలీసు పరేడ్ గ్రౌండులో స్వాతంత్ర్య దినోత్సవం నాడు నిర్వహించే సాయుధ పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్‌పి వకుల్ జిందల్ బుధవారం పర్యవేక్షించారు. తొలుత జాతీయ జెండాను ఎగురవేసి, సాయుధ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ నిర్వహణ తీరును పరిశీలించారు. కవాతు నిర్వహణలో అధికారులకు, సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ ఎఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

విజయనగరం : జిల్లాలో గృహనిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. మండల, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, హౌసింగ్ ఎఇలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత ప్రగతిపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో 81,918 ఇళ్లు మంజూరు చేయగా, 38,671 ఇళ్లు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇంకా 11,191 ఇళ్లకు కనీసం పునాదుల కూడా వేయలేదని, వీటిని వెంటనే మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీదర్ రాజా, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలకు బదిలీ అయింది. ఈ మేరకు ఎస్‌పి వకుల్ జిందాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కె.లక్ష్మణరావు బొండపల్లి నుంచి గజపతినగరం, యు.మహేష్ గజపతినగరం నుంచి బొండపల్లి, డి.సాయికృష్ణ పిటిసి నుంచి గంట్యాడ, జి.రాజేష్ విజయనగరం టుటౌన్ నుంచి బూర్జవలస, ఆర్.జయంతి బాడంగి నుంచి పెదమానాపురం, శంకర్ సంతకవిటి నుంచి వంగర, ఎ.సన్యాసినాయుడు పూసపాటిరేగ నుంచి డెంకాడ స్టేషన్లకు బదిలీ అయ్యారు.

ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి డిపోలో రెండు నూతన బస్సులను బుధవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు ఆర్‌టిసి బస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 బస్సులు డిపోకు రానున్నట్లు డిపిటిఒ సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు సిఐ బి.ఆదినారాయణ, టిడిపి నాయకులు రాజేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బడి బయట పిల్లలు లేకుండా ప్రతిఒక్కరినీ పాఠశాలలో చేర్పించాలని ఆర్‌జెడి డి.విజయభాస్కర్ కోరారు. స్థానిక పిఎస్ఆర్ స్కూల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహ పూర్వకంగా ఉండేలా విద్యా బోధన చేయాలన్నారు. పాఠశాల ఉన్న పరిసర ప్రాంతాలలో బడి బయట పిల్లలు లేకుండా అందరినీ బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో డిఇఒ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డిఇఒ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన పెంచుకోవాలి

పూసపాటిరేగ: హెచ్ఐవి వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎంఇఒలు ఏ. రాజకుమార్, బి. పాపినాయుడు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి వ్యాధిపై అవగాహన కోసం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రెడ్ రిబ్బన్ పేరుతో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ మండల స్థాయిలో జరిగిన ఈ క్విజ్ పోటీల్లో కొనాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని మహారాజా సాంస్కృతిక ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన కొనాడ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. జిల్లాస్థాయిలో జరిగేయో ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.7వేలు, రూ.5వేలు ఉంటాయని చెప్పారు. క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వివిఆర్ పేట పొలాల్లో సంచరిస్తున్న గజరాజులు

వంగర: మండలంలోని వివిఆర్ పేట పొలాల్లోకి నాలుగు రోజుల క్రితం ప్రవేశించిన గజరాజుల గుంపు ఆ గ్రామ పరిసర పొలాల్లోనే సంచరిస్తున్నాయి. గ్రామానికి అతి సమీపంలోనే గజరాజులు సంచరిస్తుండటంతో ఏ క్షణాన గ్రామంలోకి చొరబడి మనుషుల పైన పశువుల పైన, ఇళ్ల పైన దాడి చేస్తాయోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే పొలాల్లో సంచరిస్తున్న గజరాజులు తమ వరి, చెరకు, మొక్కజొన్న, వంగ పంటలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామానికి చెందిన రైతులు పట్టా శ్రీధర్, పట్టా శివకుమార్, రొంపిల్లి సింహాచలం, జక్కు పారినాయుడు, జక్కు గణపతి రావు, మిరియాల సూర్యనారాయణ, మిరియాల జానినాయుడు, పట్టా రామ్మోహన్, పట్టా సింహాచలంతో పాటు మరి కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి గౌతు లచ్చన్న

రాజాం: తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కోండ్రు మురళీ, గౌతు శిరీష అన్నారు. సంతకవిటి మండలం తాలాడ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న, ముగ్గు జగన్నాధం నాయుడు విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం, కార్మికుల ప్రయోజనాల కోసం దళితులు బహుజనుల బాగు కోసం అలుపెరుగని పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న అందరికీ ఆదర్శప్రాయమని ఆయన ఆశయాలను మనమంతా కొనసాగించాలని చెప్పారు. ఉద్యమాలకు ఊపిరిగా ఆశయసాధన లక్ష్యంగా జన జీవన గమనాన్ని సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ళ అప్పలనాయుడు, గట్టి భాను, మనేన్న రమేష్ ఎస్సి సెల్ అధ్యక్షులు, రాజాం నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు బవిరి శ్రీనివాసరావు, పిన్నింటి మోహనరావు, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌కు క్రీడాకారుల ఎంపిక

శృంగవరపుకోట: పట్టణంలని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పంపాన మౌనిక, భరణికాన హారిక రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో గత నెల 18 నుండి 21వ తేదీ వరకు జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్, ఎంపిక పోటీల్లో స్త్రీల విభాగంలో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో ఎంపికై ఈ నెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్రస్థాయి ఉమెన్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వీరిని బుధవారం బొడ్డవరలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు అభినందనలు తెలిపారు.

పోలిపల్లి పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి భాస్కరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలను అధిక సంఖ్యలో చేయాలని ఆదేశించారు. బిసిజి టీకాలు లక్ష్యం నెరవేర్చాలని సిబ్బందికి సూచించారు. జ్వరాల భాదితులను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మలేరియా పరీక్షలు కూడా విధిగా చేయాలని చెప్పారు. అనంతరం పిహెచ్‌సి రికార్డులను తనిఖీ చేశారు. పోలిపల్లి గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట సిఎచ్ఒ చంద్రశేఖర్ రాజు, డాక్టర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ కుమార్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటికి ఐదుగురు బాలికలు ఎంపిక

జామి: మండలంలోని కుమరాం కెజిబివి పాఠశాలలో చదివిన ఐదుగురు ఆడపిల్లలకు నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ఈ మేరకు ఉపాధ్యాయుల బృందం తీవ్రంగా కృషి చేసిందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం పౌర వేదిక ప్రతినిధులతో కలిసి ప్రిన్సిపాల్ బలగ జ్యోతి ఇతర ఉపాధ్యాయులను సత్కరించారు. భీశెట్టి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆడపిల్లలు ఉన్నత స్థాయికి రావడానిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాలు తమ లక్ష్యం చేరుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, ఉపాధ్యక్షుడు పి.ప్రభాకరరావు, బైరాగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ ద్వారా రైతుకు మేలు

శృంగవరపుకోట: డ్రమ్ సీడర్ ద్వారా రైతుకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె రవీంద్ర అన్నారు. మండలంలోని పెద్దకండేపల్లి గ్రామంలో రైతు తానవరపు బంగారు నాయుడు పొలంలో డ్రమ్ సీడర ద్వారా బుధవారం మూడు ఎకరాల విస్తీర్ణంలో వరి విత్తనాలు వేయించారు. ఈ పద్ధతిలో విత్తనాలు వేసుకోవడం ద్వారా సాధారణ పద్ధతిలో మూడు ఎకరాలకు 90 కిలోల విత్తనాలు అవసరమైతే ఈ విధంగా మూడు ఎకరాలకు 30 కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. దీని వల్ల సుమారు 2000 రూపాయల వరకు పొదుపు అవుతుందని ఉడుపులకు, ఆకు తీయడానికి సాధారణ పద్ధతిలో సుమారు 30 వేలు ఖర్చు అవుతుందని. అదే డ్రమ్ సీడర్ పద్ధతి వల్ల దీనికి గాను వేయి రూపాయలు మాత్రమే ఖర్చు అయిందని దీనివల్ల రైతుకు సుమారుగా 40 వేల రూపాయల వరకు ఖర్చులు ఆదా అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కే తేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బైరిపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బైరిపురం గ్రామంలో సుమారు మూడు వందల మంది విద్యార్థులు బుధవారం హారఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారు. జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మరడా ఈశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను గ్రామ పుర వీధులలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దాసు, కొత్త వీధి పాఠశాల హెచ్ఎం శ్రీను, రెడ్డి లక్ష్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్వారీల వలయంలో రామచంద్రపేట

- గ్రామానికి సమీపంలో ఇప్పటికే ఐదు క్వారీలు
- కొత్తగా గ్రామానికి ఆనుకుని మరో క్వారీ ఏర్పాటు
- బాంబుల పేలుళ్లతో ఇళ్లల్లో రాలుతున్న పెచ్చులు
- ఆపై వచ్చే ధూళితో కలుషితమవుతున్న గ్రామం
- పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు



కొత్త క్వారీలో పనులు చేస్తున్న జిఎంఆర్ సంస్థ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రామచంద్రపేట గ్రామస్తులు క్వారీల వలయం చిక్కుకున్నారు. నిత్యం క్వారీల్లో జరిగే బాంబుల పేలుళ్లకు విలవిల్లాడుతున్నారు. ఇంటి పైకప్పుతో పాటు గోడల పెచ్చులు రాలుతున్నాయి. మరో పక్క పేలుళ్ళ సమయంలో వచ్చే ధూళి గ్రామం పైకి వస్తుండడంతో తాగునీరు, గాలి కలుషితమవుతున్నాయి. దీంతో గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకు పెరుగుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటు ప్రజాప్రతినిధులు కాని అటు అధికారులు కాని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతలో మరో క్వారీకి అనుమతులు ఇచ్చేయడంతో వారి బాధలు వర్ణానతీమయ్యాయి. ఇప్పటికే గ్రామం చుట్టూ ఐదు క్వారీలతో ఇబ్బంది పడుతున్నామని ఇప్పుడు మరో క్వారీ వద్దని గ్రామస్తులంతా అడ్డుపడినాసరే పోలీసుల పహారా మధ్య క్వారీ పనులు ప్రారంభించడం విశేషం.


కొంగవానిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని రామచంద్రపేట గ్రామం చుట్టు క్వారీలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కొంత మంది పెద్దలు దశలవారీగా అనుమతులు తెచ్చుకొని ఏర్పాటు చేశారు. ఇలా సుమారు ఐదు క్వారీలు ఉండగా వాటితోనే నానా ఇబ్బందులు పడుతున్నారు. తీరా ఇటీవలి ఎన్నికల ముందు కొత్తగా విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్ ఇదే గ్రామం పక్కన మరో క్వారీకి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. దీంతో గతంలో జిఎంఆర్ సంస్థ ఈ పనులను ప్రారంభించేందుకు ఎనిసార్లు ప్రయత్నించినా గ్రామస్తులు అడ్డుకున్నారు. చివరకు ఇటీవలి ప్రభుత్వం ఒత్తిడితో భారీగా పోలీసులను మోహరించి క్వారీ పనులను ప్రారంభించారు. చివరకు అర్ధరాత్రి వేళ గ్రామ పెద్దలకు నోటీసులిచ్చి భయభ్రాంతులకు గురిచేశారని గ్రామస్తులు వాపోతున్నారు.



కాలును పోగొట్టుకున్న బంగారమ్మ

పేలుళ్లతో కాలు పోగొట్టుకున్న మహిళ

క్వారీల్లో మధ్యాహ్నం పూట భారీగా పేలుళ్ళు నిర్వహిస్తుంటారు. రెండేళ్ల కిందట గ్రామానికి చెందిన గొంపా సూరి బంగారమ్మ క్వారీల వైపు వెళ్లింది. ఒక్కసారి పేలుళ్ళు జరగడంతో ఒక రాయి నేరుగా వచ్చి ఆమె కాలును కోసుకుపోయింది. దీంతో ఆసుపత్రికి తరలించగా కాలును తీసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కృత్రిమ కాలిని ఏర్పాటు చేసుకొని నడుస్తోంది. ఆమె కూలికి వెళితే ఎంతోకొంత ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఇంటివద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని సంబంధిత యాజమాన్యం మాత్రం ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదు. ఈ పేలుళ్ళకు గ్రామంలోని చాలా మంది ఇళ్ళల్లో ఇంటి పైకప్పు పెచ్చులు రాలిపడుతున్నాయి. పేలుళ్ళు సమయంలో వచ్చే ధూళి గ్రామంపైకి వస్తుండడంతో తాగునీరు కలుషితమయ్యిందని గ్రామస్తులు అంటున్నారు. దీంతో చాలామంది కిడ్నీలు పాడై ఆసుపత్రులు చట్టు డయాలిసిస్ కోసం తిరుగుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికే ఈ వ్యాధితో నలుగురు చనిపోయినట్లు చెబుతున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేస్తున్న క్వారీ గ్రామానికి 250 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో వీరంతా గత కొన్ని రోజులు నుంచి ఆందోళన చెందుతున్నారు.



పెచ్చులూడిపోయిన ఇంటి ఒక లోపలి భాగం

క్వారీలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం

గ్రామం చుట్టు క్వారీలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే ఉన్న క్వారీలతో ఇబ్బందిపడుతుంటే కొత్తగా మరో క్వారీ ఏర్పాటు చేశారు. బాంబు పేలుళ్ళుకు ఇళ్ళల్లో పెచ్చులు రాలుతున్నాయి. గ్రామస్తులు చాలా ఆందోళన చెందుతున్నారు.

- దుక్క రవణ, గ్రామస్తుడు

క్వారీ అనుమతులు వెంటనే రద్దు చేయాలి

గ్రామస్తులు వద్దంటున్నా సరే ఇక్కడ క్వారీకి అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉన్న క్వారీలతో గ్రామస్తులు నరకం చూస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలి. లేదంటే రద్దు చేసే వరకూ పోరాటం చేసేందుకు వెనుకాడం.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

గిరిజన గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని రోడ్డు మార్గం లేని దిగువకొండపర్తి, అడ్డతీగ, ముసలి కంటి గ్రామాలలో విజయనగరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ్ కళ్యాణి బుధవారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వితంతు, ఒంటరి మహిళల పింఛన్లు అందని వారి గురించి అడిగి తెలుసుకుని వారి వివరాలు సేకరించారు. వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి లబ్ది పొందని వారి గురించి ఆరా తీశారు. అన్ని విధాలుగా అర్హులై ఉండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా సంక్షేమ పథకాలు అందని ఎడల జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చునని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రజలకు ఎప్పుడూ సేవ చేయడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలలో జరుగుతున్న బాల్య వివాహాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. బాల్యవివాహాలు చట్టరీత్య నేరమని, అటువంటి వారిపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో ఎంఆర్ఐ హరిప్రియ, మండల సర్వేయర్, గ్రామ సర్పంచ్ సీతమ్మ, సచివాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



వేపాడ: స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జడ్జి విజయ్ చందర్

కెజిబివి వసతి గృహాన్ని పరిశీలించిన జడ్జి

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట కెజిబివి వసతి గృహాన్ని కొత్తవలస కొత్తవలస సివిల్ జడ్జి డాక్టర్ ఎస్. విజయ్ చందర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న స్టాక్ రూమ్, డైనింగ్ హాలు, విద్యార్థులకు ఇస్తున్న వంటలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, తాగు నీరు, వసతి గృహంలో ఉన్న గదులను పరిశీలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత వరకూ తాను పరిశీలించిన వసతి గృహాల్లో ఇదే బాగుందని కితాబిచ్చారు. ఈ పరిశీలనలో కొత్తవలస కోర్టు బార్ కౌన్సిల్ మెంబర్లు డి. శ్రీనివాస్, గొంప వెంకటరమణ, జి. కృష్ణ, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: తుమ్మికాపల్లి కెజిబివి పాఠశాలలో కొత్తవలస సివిల్ జడ్జి డాక్టర్ ఎస్. విజయ్ చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినిలకు ఎటువంటి సదుపాయాలు కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఆహారాన్ని అందిస్తున్నారో క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు ఎంత మంది సిబ్బంది ఉన్నారో, విద్యార్థినిల హాజర శాతాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. మీరు అందించిన చదువు వారు బంగారు భవిష్యత్తుకు ఒక దారి చూపాలని అన్నారు. ప్రిన్సిపాల్ కె. విజయ్ కుమారి జడ్జికి పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి సదుపాయాలు కల్పిస్తున్నారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు, న్యాయవాదులు డి శ్రీనివాస్, జి.వి. రమణ, జి. శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల సందర్శన

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచుల శిక్షణా తరగతులను పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణమోహన్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. శిక్షణ తరగతులు జరుగుతున్న తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ఇఒపిఆర్‌డి ధర్మారావును శిక్షణను గూర్చి అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు, కార్యదర్శులు కలిసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఒక ప్రణాళిక రూపొందించాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ శిక్షణా తరగతులు సర్పంచుల పరిపాలనకు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా ఆఖరి రోజు హౌసింగ్ ఇంజనీరింగ్ సిబ్బందికి సంబంధించిన వివరాలు గురించి చర్చించారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అందరూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే తప్ప గ్రామం అభివృద్ధి మార్గంలో పురోగతి సాధించడం సాధ్యం కాదని శిక్షణలో పాల్గొన్న అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలిపారు.

శిక్షణా తరగతులకు సర్పంచులు గైర్హాజరు

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో గత 3 రోజుల నుంచి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు బుధవారం ముగింపు రోజు కాగా సర్పంచులు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. మండలంలో 22 గ్రామ పంచాయతీలలో ఒక్క సర్పంచ్ కూడా శిక్షణకు హాజరుకాకపోవడం విశేషం. గ్రామ పంచాయతీలలో వివిధ అబివృద్ధి పనులు, నిధుల వినియోగం, సర్పంచ్ బాధ్యతలు, హక్కులు తదితర అంశాలపై క్షుణ్ణంగా సర్పంచులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఈ శిక్షణా తరగతులను ఏర్పాటు చేసింది. ఉదయం 12 గంటలైనా ఈ శిక్షణా తరగతులకు అధికారులు కూడా హాజరుకాలేదు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశ్యంతో చేపట్టిన ఇటువంటి కార్యక్రమాలకు ప్రజాప్రతినిదులు, అధికారులే హాజరుకాకపోతే సామన్య ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మండల అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అంగన్వాడీ పిల్లలకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లంక రామునర్శి అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు తన సొంత సొమ్ముతో దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 12 అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు రూ.50 వేల విలువ చేసే దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రమణమూర్తి, టిడిపి నాయకులు సుందరరావు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

జరజాపుపేటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో బుధవారం పద్మ విభూషణ్, సినిమా నటులు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గల్ఫ్ దేశాల ఎన్ఆర్ఐ జనసేన ఆధ్వర్యంలో నల్లి సాయి, రాజు బ్రదర్స్ న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ స్థానిక నల్లి సూరిబాబు స్మారక కళా వేదిక వద్ద రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రారంభించారు. శిబిరంలో 50 యూనిట్లు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, చందక రామదాసు, రత్నం, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కె. కళావతి, జనసేన నాయకులు నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిల్లు తెరిపించి ఉపాధి కల్పించాలి: సిఐటియు

స్థానిక జ్యూట్‌మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు ఎమ్మెల్యే లోకం నాగ మాధవిని కోరారు. ఈ సందర్భంగా ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ గత మూడు నెలలుగా మిల్లు యాజమాన్యం అక్రమంగా మిల్లును మూసి వేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని ఎమ్మెల్యే చొరవ చూపి మిల్లును తెరిపించి ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మిల్లు తెరిపించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు గత కొన్నేళ్లుగా దురాక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఇప్పటికైనా ఆక్రమణలను అడ్డుకోవాలని జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్చార్జ్ గిరడ అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. రామభద్రపురం జాతీయ రహదారికి ఆనుకొని భారతీయ స్టేట్ బ్యాంకుకు చేరువలో ఉన్న సుమారు 18 సెంట్ల భూమిని కొంతమంది పెత్తందారులు దురాక్రమణ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, సదరు భూమిలో జెసిబితో చదును కూడా చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ భూముల ధరలు విపరీతంగా ఉండడంతో అక్రమార్కులు ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసి కబ్జాచేసి అమ్మకానికి పెట్టుకుంటున్నారని ఆరోపించారు. గతంలో కూడా ఆర్‌టిసి బస్సు స్టాండ్ సమీపంలో కొంతభూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే జనసేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితురాలు?

- వీడనున్న వృద్ధురాలి హత్య కేసు
- పరారైన వారి కోసం గాలింపు

ప్రజాశక్తి-బొబ్బిలి, బాడంగి

బాడంగి మండలం ముగడ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన వృద్ధురాలు గద్దె కృష్ణవేణి హత్య కేసును పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. హత్య జరిగిన 48గంటల వ్యవధిలో హత్య చేసిన నిందితురాలు లలితను విజయనగరం క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి దోచుకున్న బంగారు నగలను రికవరీ చేసినట్లు సమాచారం. వృద్ధురాలు హత్య కేసులో ముగ్గురు నిందితులు ఉండగా ప్రధాన నిందితురాలను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితురాలను అరెస్టు చేసినట్లు బొబ్బిలిలో పోలీసులు ప్రకటించడంతో హత్యకు సహకరించిన మిగిలిన నిందితులు పరార్ అయినట్లు తెలుస్తుంది. హత్యకు సహకరించిన నిందితులు పరార్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పథకం ప్రకారమే హత్య

ముగడ కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న వృద్ధురాలు గద్దె కృష్ణవేణిను పథకం ప్రకారమే హత్య చేసినట్లు తెలుస్తుంది. పారాది గ్రామానికి చెందిన కె.లలిత అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. అక్రమ సంబంధం విషయం భర్తకు తెలియడంతో భర్తను హత్య చేసింది. భర్త హత్య కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన లలిత బాడంగి మండలం ముగడ కాలనీలో అద్దె ఇంటిలో నివాసముంటుంది. హత్యకు గురైన వృద్ధురాలు, హత్య చేసిన నిందితురాలు ఒకే సామాజిక వర్గం కావడంతో ఇద్దరు కలిసి మెలిసి ఉండేవారు. వృద్ధురాలు కృష్ణవేణి మెడలో నిత్యం బంగారు నగలు ఉండడంతో ఎలాగైనా కొట్టేయాలని నిర్ణయించుకున్న లలిత నెల రోజుల క్రితం అద్దె ఇంటిని ఖాళీ చేసి వెళ్లి పోయింది.

ఆదివారం రాత్రి వృద్ధురాలు ఇంటికి వెళ్లి ఏవో మాయమాటలు చెప్పి రాత్రికి ఇంటిలో ఉంటానని చెప్పి ఇద్దరు ఇంటిలో నిద్ర పోయారు. పథకం ప్రకారం ఇంటిలోకి ప్రవేశించిన లలిత అర్ధరాత్రి తలుపులు తెరిచి తనతో వచ్చిన మరికొంతమందిని ఇంటిలోకి రప్పించుకొని వృద్ధురాలను కిరాతకంగా చంపి సుమారు 15 తులాల బంగారు నగలను అపహరించుకుపోయారు. హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు వృద్ధురాలు మృతదేహంపై ప్లాస్టిక్ కవర్లను పెట్టి నిప్పంటించి గ్యాస్ లీక్ చేసి వెళ్లిపోయారు. ప్లాస్టిక్ సంచులకు ఉన్న నిప్పు ఆరిపోవడంతో పాటు గ్యాస్ బయకు వెళ్లడం వల్ల ఎటువంటి మంటలు చెలరేగలేదు.

పథకం ప్రకారమే వృద్ధురాలను హత్య చేసినట్లు పోలీసులు అనుమానించి సీసీ ఫుటేజీలు ఆధారంగా కేసు దర్యాప్తు చేసి ప్రధాన నిందితురాలను విజయనగరం సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. హత్యకు సహకరించిన వారి వివరాలు సేకరించి అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.